క్లుప్తంగా

బీసీలంటే చంద్రబాబుకు చిన్నచూపు



పట్నంబజారు: బడుగుబలహీన వర్గాలంటే చంద్రబాబుకు తొలి నుంచి చిన్నచూపేనని వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు తాడిబోయిన వేణుగోపాల్ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. కూటమి పాలన ఏడాది పూర్తి అయిన సందర్భంగా బీసీలకు ఇచ్చిన హామీలపై మాట్లాడారు. ఎన్నికల సమయంలో లెక్కలేనన్ని హామీలనిచ్చి, తీరా గెలిచిన తరువాత బీసీలను వెన్నుపోటు పొడుతున్నారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 45 సంవత్సరాలు దాటిన బీసీ మహిళలకు రూ.18వేలు ప్రతి ఏటా ఆర్థిక సాయాన్ని అందించి వారిని ఆసరాగా నిలబడిన విషయాన్ని గుర్తు చేశారు. బీసీ చేతివృత్తిదారులైన రజక, నాయీబ్రాహ్మణతో పాటు అనేక సామాజికవర్గాల్లో ఉన్న వారికి ప్రత సంవత్సరం రూ.10 వేలు అందించారని తెలిపారు.

హామీల అమలులో కూటమి విఫలం



లక్ష్మీపురం: కేంద్రంలోని బీజేపీ కూటమి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చినా, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయలేదని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ పేర్కొన్నారు. గుంటూరు హనుమాన్ నగర్‌లోని 29వ డివిజన్ సీపీఐ శాఖ మహాసభ స్థానిక శాఖ కమిటీ అధ్యక్షుడు బాషా అధ్యక్షతన నిర్వహించారు. తొలుత పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, బి.వెంకటేశ్వరరెడ్డి, ఆకిటి అరుణ్‌కుమార్, రావుల అంజిబాబు, చల్లా ఆంజనేయులు, వలి, నూతలపాటి చిన్న పాల్గొన్నారు.

అలరించిన వాగ్గేయకార సంకీర్తన



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఆదివారం వాగ్గేయకార సంకీర్తన నిర్వహించారు. అవధూతేంద్ర భక్త బృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. భగవన్ నామస్మరణతో శ్రీహరి శరణ్ మహరాజ్ బృందం జయ జయ గణనాయక, జయగురు జయగురు సచ్చిదానంద గురు, హరేరామ హరేరామ రామరామ హరేహరే అంటూ వాగ్గేయ కీర్తనలు ఆలపించారు. కీర్తనల సారాంశాన్ని ప్రవచన రూపంలో వివరించారు. ప్రేక్షకులను అలరించాయి. డోలక్‌పై షణ్ముఖశర్మ వాయిద్యాన్ని అందించారు. అనంతరం బృంద సభ్యులను ఆలయ కమిటీ సత్కరించారు.

ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి



నెహ్రూనగర్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఐసీడీఎస్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ పి.మునిరాజు సూచించారు. ఆదివారం ముత్యాలరెడ్డి నగర్‌లో క్రైస్ట్ అర్బన్ సెంటర్ మినిస్ట్రీస్(సీఏసీఎం) ఆధ్వర్యంలో పేద పిల్లలకు ఉచితంగా నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న నాటి నుంచే తల్లిదండ్రులను గౌరవిస్తూ, సమాజంపై అవగాహనతో ముందుకు సాగుతూ తమ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఓసీఎం డైరెక్టర్ ఎం.స్టీఫెన్‌సుందర్, కోశాధికారి కురగంటి సువర్ణకుమారి, సెక్రటరీ బొడ్డు బ్లాండినమ్మ, సంస్థ మెంబర్స్ రమావత్ హనుమానాయక్, సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

జూలై 5న విద్యుత్ చార్జీల పెంపుదలపై నిరసన

లక్ష్మీపురం: విద్యుత్ చార్జీల పెంపుదలపై జూలై 5వ తేదీ ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఐ నాయకుడు షేక్ వలి పేర్కొన్నారు. ఆదివారం శ్రీనగర్‌లో ప్రచార ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్ల రద్దు, చార్జీల తగ్గించాలని డిమాండ్ చేశారు. గుంటూరు నగరంలోని లిబర్టీ సినిమా హాల్ సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రెహ్మాన్, ఇస్మాయిల్, జిలానీ, ఖాదర్, అల్లా భక్షు పాల్గొన్నారు.

'గోకులం' బిల్లుల చెల్లింపుల్లో జాప్యం!

- లబ్ధిదారులకు తప్పని ఎదురుచూపులు
- ఆరు నెలలుగా నగదు రాక ఇబ్బందులు



మండలంలో పూర్తయిన గోకులం షెడ్డు

పొన్నూరు: పశువులకు నీడ కల్పించడానికి ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన మినీ గోకులం షెడ్ల నిర్మాణ బిల్లులు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు తమ వంతుగా 10 శాతం సొమ్ము చెల్లిస్తే మిగిలిన యూనిట్ మొత్తాన్ని ప్రభుత్వం రాయితీపై నిర్మిస్తుంది. షెడ్ల నిర్మాణానికి రాయితీ ఎక్కువగా ఉండటంతో పెద్ద ఎత్తున రైతులు షెడ్లు నిర్మించుకునేందుకు ముందుకొచ్చారు. మొదట్లో షెడ్డు నిర్మించిన వెంటనే బిల్లులు మంజూరు చేసి రైతుల బ్యాంకు ఖాతాల్లో కొంత నగదును జమ చేశారు. గత 6 నెలల నుంచి చెల్లింపులు లేక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.

అప్పులు చేసి నిర్మాణాలు..

పొన్నూరు మండలంలోని 23 గ్రామాల్లో 27 మినీ గోకులం షెడ్లను మంజూరు చేశారు. దీంతో రైతులు త్వరితగతిన నిర్మాణాలు చేపట్టారు. ఇప్పటికీ 19 షెడ్లు పూర్తి కాగా.. మరో 3 షెడ్లు నిర్మాణ దశలో ఉన్నట్లు సమాచారం. అయితే పూర్తయిన గోకులం షెడ్లకు బిల్లులు చెల్లింపులకు ఎదురు చూపులు తప్పడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. అప్పు చేసి నిర్మాణాలు చేపట్టామని.. వడ్డీ పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంజూరైన షెడ్లకు సంబంధించి ఒక గ్రామంలో రెండు గేదెల షెడ్డుకు రూ.1.15 లక్షలు.. 6 పశువుల షెడ్లకు సంబంధించి 18 గ్రామాల రైతులకు మొత్తం సుమారు రూ.40 లక్షల వరకు రావాల్సి ఉంది. అయితే ఇప్పటికీ ఒక్కొక్కరికీ రూ.2.30 లక్షలు జమ చేయాల్సి ఉన్నా కొంత మేరకు మాత్రమే జమ కావడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. మిగిలిన నగదు కూడా వెంటనే జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. సుమారు రూ.12 లక్షల వరకూ బకాయిలు రావాల్సి ఉందని తెలిసింది. ఇంకా విడతల వారీగా నగదు జమ చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

షెడ్డు సామర్థ్యం, రైతు చెల్లించాల్సిన నగదు వివరాలు..

గేదెల వారీగా	మంజూరు	రైతు చెల్లించాల్సింది
రెండు గేదెల షెడ్డుకు	రూ.1.15 లక్షలు	రూ.11,500
నాలుగు గేదెల షెడ్డుకు	రూ. 1.85 లక్షలు	రూ.18,500
ఆరు గేదెల షెడ్డుకు	రూ.2.30 లక్షలు	రూ.23,000

విడతల వారీగా నగదు జమ..



అపరిష్కృతంగా ఉన్న బిల్లులలో ఇటీవల సుమారు రూ.11 లక్షలు లబ్ధిదారుల ఖాతాలకు జమయ్యాయి. గోకులం షెడ్లకు సంబంధించి ఎప్పటికప్పుడు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. నిధులు విడుదల కాగానే విడతల వారీగా నిధులు జమ చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– గుమ్మా చంద్రశేఖరరావు, ఎంపీడీఓ, పొన్నూరు

పుస్తకాలు, విద్య ఉపకరణాలు పంపిణీ



అనాథాశ్రమంలో బాలలతో నిర్వాహకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచ బధిర వికలాంగుల దినోత్సవం సందర్భంగా సంఘమిత్ర మొహమ్మద్ సిరాజుద్దీన్ సహకారంతో వర్సటైల్ సర్వీసెస్ ట్రస్ట్, శ్రీకృష్ణ అకాడమీ సంయుక్తంగా ఆదివారం ఏటుకూరులోని అభినందన పిల్లల ఆశ్రమంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, విద్య ఉపకారణాలు, ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యుడు మొహమ్మద్ సిరాజుద్దీన్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస ప్రసంగం చేశారు. అదే విధంగా అనాథాశ్రమంలోని బాలల అవసరాల నిమిత్తం ఇన్వర్టర్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ట్రస్ట్ చైర్మన్ పాశం శ్రీకృష్ణదేవరాయ యాదవ్ మాట్లాడుతూ బధిర దివ్యాంగుల సంక్షేమం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన హెలెన్ కెల్లర్ జయంతి సందర్భంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాశం సర్దార్ అభినంద్ యాదవ్, కోనంకి మురళీకృష్ణ యాదవ్, బొడ్డుపల్లి కోటేశ్వరరావు, జీవన్, హర్ష దుర్గాప్రసాద్, సతీష్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ మహాసభలకు హాజరైన గుంటూరు విద్యార్థులు



కేరళలో నిర్వహిస్తున్న అఖిల భారత మహాసభల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా విద్యార్థి సంఘ నాయకులు

లక్ష్మీపురం: కేరళలోని కొజికోడ్ జిల్లాలో 18వ ఎస్ఎఫ్ఐ అఖిల భారత మహాసభల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘ నాయకులు హాజరయ్యారు. ఈ మహాసభల్లో దేశ నలుమూలల నుంచి అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ఎం.కిరణ్, కోట సాయి, షేక్ సమీర్, నవిత, యశ్వంత్, అమూల్య, సౌమ్య, భాను మహాసభలకు హాజరయ్యారు.

వృద్ధాప్యంలో జనరల్ హెల్త్ చెకప్ అవసరం

డాక్టర్ రావెళ్ల శ్రీగీత



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీగీత

లక్ష్మీపురం: వృద్ధాప్యంలో శారీరకంగా, మానసికంగా వివిధ మార్పులు ఉంటాయని, ప్రతి మార్పుకి దిగులు, ఆందోళన చెందకుండా డాక్టర్ల సలహాతో రెగ్యులర్ హెల్త్ చెకప్‌లు చేయించుకుంటూ అప్రమత్తంగా ఉండాలని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రావెళ్ల శ్రీగీత సూచించారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షత ఆరోగ్య సభ నిర్వహించారు. సభకు సంస్థ సీనియర్ సభ్యులు కె.చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ వయస్సు 40 దాటిన దగ్గర నుంచి శరీరం వృద్ధాప్యం బాటపడుతుందని గుర్తించాలని, అది అర్థం చేసుకుని అప్పటి నుంచి ఆరోగ్యం గురించి కాస్త జాగ్రత్తపడితే వృద్ధాప్య ఛాయలు అంత త్వరగా దరిచేరకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. వృద్ధాప్యంలో వ్యాయామం పరమౌషధమని, నడక, సైక్లింగ్, యోగా, గార్డెనింగ్, ఈత తదితరాలు వీలును బట్టి చేయాలని సూచించారు. వ్యాయామం వల్ల రక్త ప్రసరణ, శ్వాసకోశాల పని తీరు పెరుగుతాయని అన్నారు. మానసిక ఒత్తిడి తొలగుతుందని, ఇమ్యూనిటీ పెరుగుతుందని, జీర్ణశక్తి బాగుంటుందని పేర్కొన్నారు. ఎముకలు పటిష్టంగా మారుతాయన్నారు. డాక్టర్ శ్రీగీతను ఘనంగా సత్కరించారు. సభలో డాక్టర్ రవీంద్ర కుమార్, డాక్టర్ ఆర్.రామ చంద్రరావు, ఏవీ రామారావు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని పీవీకి ఘన నివాళి

లక్ష్మీపురం: ఆర్థిక సంస్కరణల రూపశిల్పి, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు భారత రాజకీయ చరిత్రలో నిలిచిపోయారని అవగాహన సంస్థ కార్య దర్శి కొండా శివరామిరెడ్డి, అర్థశాస్త్ర ఉపన్యాసకులు సిహెచ్.సుబ్బారెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావు జయంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగ చర్చా వేదిక కార్యదర్శి అవధానుల హరి, వాణిజ్యవేత్త గుప్త, అధ్యాపకులు, రచయిత కె.జయకుమార్ పాల్గొన్నారు.

కంటి సమస్యలపై అప్రమత్తత అవసరం



డాక్టర్ మౌళీకృష్ణను సత్కరించిన అసోసియేషన్ నాయకులు

తెనాలి: కంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని పట్టణానికి చెందిన నేత్ర వైద్యనిపుణుడు మౌళీకృష్ణ తాళ్లూరి సూచించారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం జూన్ నెల సమావేశాన్ని ఏర్పాటుచేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. సమావేశంలో 'వృద్ధాప్యం– నేత్రసమస్యలు– అవగాహన' అంశంపై డాక్టర్ మౌళీకృష్ణ ప్రత్యేక ప్రసంగం చేశారు. జ్ఞానేంద్రియాల్లో కంటికి గల ప్రాధాన్యతను గుర్తు చేశారు. ముఖ్యమైన కంటి సమస్యల్లో శుక్లాలు ఒకటని చెప్పారు. నివారణకు మందులు లేవనీ, కేవలం సర్జరీనే పరిష్కారమని సూచించారు. నీటి కాసులుగా పిలుచుకునే గ్లూకోమా చాలా ప్రమాదకరమని, దీనిపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. షుగర్‌ను నియంత్రణలో ఉంచుకోవాలని, లేనిపక్షంలో చూపు తగ్గిపోయే అవకాశం ఉందని చెప్పారు. ముందుగా సభాధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ డాక్టర్ మౌళీకృష్ణను సభ్యులకు పరిచయం చేశారు. ప్రసంగం అనంతరం ఆయన్ను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ప్రసాదం పూర్ణచంద్రరావు, కొరిటాల జ్ఞానేంద్రప్రసాద్, కొరిటాల ఈశ్వరచంద్, అబ్బూరు రాజారావు, కొలసాని వెంకట కోటయ్య, పూచ్చకాయల కోటిరెడ్డి, నర్రావుల ఆదినారాయణ, కో–ఆప్షన్ సభ్యుడు కుప్పాల చలమయ్య, చెరుకూరి శివరామయ్య పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

నెహ్రూనగర్: డయల్ యువర్ కమిషనర్ సోమవారం నిర్వహించనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. 0863–2224202 నంబర్‌కు ఫోన్ చేయాల్సిందిగా కోరారు. అనంతరం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'(పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం కౌన్సిల్ సమావేశ మందిరంలో నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని నగర కమిషనర్ ఆ ప్రకటనలో తెలిపారు.

3, 4వ తేదీల్లో నగర మేయర్ హరియాణా పర్యటన

నెహ్రూనగర్: అర్బన్ లోకల్ బాడీస్(యూఎల్‌బీ) బలోపేతం చేసేందుకు గాను కేంద్ర ప్రభుత్వం రెండు రోజుల పాటు హరియాణాలో నేషనల్ లెవల్ కాన్ఫరెన్స్ జూలై 3, 4 తేదీల్లో నిర్వహించనుంది. ఈ కాన్ఫరెన్స్ సమావేశానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపాలిటీల్లో(యూఎల్‌బీ) ప్రాతినిధ్యం వహిస్తున్న మేయర్లు, డెప్యూటీ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు రావాలని సూచించిన నేపథ్యంలో గుంటూరు నగరపాలక సంస్థ నుంచి నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, డెప్యూటీ మేయర్ షేక్ సజీల వెళ్లాలని సూచిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్‌కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ హాల్‌లో ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అధ్యక్షత వహించనున్నట్లు చెప్పారు. మొత్తం 57 అంశాలకు సంబంధించిన సభ్యుల ప్రశ్నలు, కార్పొరేషన్ ప్రియాంబుల్స్‌పై కౌన్సిల్ సభ్యులు చర్చించనున్నారు.

ఎయిమ్స్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఎంపిక

మంగళగిరి, మంగళగిరి టౌన్: ఎంటీఎంసీ పరిధిలోని ఆల్ ఇండియా మెడికల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ (ఎయిమ్స్) ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. నగర పరిధిలోని నవులూరు నూతన కార్యాలయాన్ని ప్రారంభించి కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ప్రతినిధులు తెలిపారు. అధ్యక్షుడిగా జి.కోటేశ్వరరావు, జనరల్ సెక్రటరీగా పి.శివశంకర్, వైస్‌ప్రెసిడెంట్‌గా ఎన్.సురేష్, కోశాధికారిగా టి.రాంబాబు, జాయింట్ సెక్రటరీగా షాజిద్, కోర్ కమిటీ ప్రతినిధులుగా జి.యోహాను, కె.సతీష్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

కాంట్రాక్టర్ ఇంట్లో బంగారం చోరీ

లక్ష్మీపురం: కాంట్రాక్టర్ ఇంట్లో బంగారం చోరీకి పాల్పడిన ఘటనపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. అరండల్‌పేట 1/3వ లైన్‌లోని పయనీర్ సిటీ అపార్ట్‌మెంట్‌లో కాంట్రాక్టర్ రత్నసాయి నివసం ఉంటున్నాడు. ఈ నెల 24వ తేదీ సాయంత్రం 4.30 గంటల సమయంలో రత్నసాయి, భార్యతో కలసి బజారుకు వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి బీరువాలో ఉన్న 67 గ్రాములు బంగారం చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో అపార్ట్‌మెంట్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి బంగారం చోరీ చేసినట్లు గమనించారు. అయితే ఆ ఇద్దరు వ్యక్తులు ఎవరన్న విషయం పై చుట్టు పక్కల, అపార్ట్‌మెంట్‌కు వచ్చి పోయే వారి గురించి విచారించగా ఎలాంటి ఆచూకీ తెలియక పోవడంతో ఆదివారం రాత్రి అరండల్‌పేట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

పెదకాకాని: అర్హులైన పేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నియోజకవర్గ స్థాయి మహాసభ నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా రైతు సంఘం కార్యదర్శి కొల్లి రంగారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మట్లాడుతూ.. అర్హులకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు చొప్పున పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలన్నారు. గృహ నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శిగా పుప్పాల సత్యన్నారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కమిటీలో కొల్లి రంగారెడ్డి, రెంటాల కుమారి, ఆరేటి రామారావు, పాటిబండ్ల డేవిడ్‌రాజు, షేక్ గౌస్, కూసం నాగిరెడ్డిలను ఎన్నుకున్నామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గీత కులాలన్నీ ఏకతాటిపైకి రావాలి



సంఘీభావం తెలియజేస్తున్న గౌడ సంఘం నాయకులు

నెహ్రూనగర్: గీత కులాలన్ని ఒక తాటి మీదకు వచ్చి అన్ని రంగాల్లో రాణించడంతో పాటు రాజకీయంగా రాణించాలని అవసరం ఎంతైన ఉందని రిటైర్డ్ డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. స్థానిక నెహ్రూనగర్ 12వ లైనులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌడ మహాజన ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీత కులాలైన గౌడ, శెట్టి బలిజ, ఈడీగా, శ్రీశైయన, యాత కులాలకు చెందిన వారంతా రాష్ట్రంలో ఐక్యంగా ముందుకు సాగుతూ తమ హక్కుల కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కమిటీలను త్వరలో ఏర్పాటు చేసుకునేందుకు గాను ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు చాలపాటి వెంకటేశ్వరరావు, తులసీ రామ్, డి కుమారస్వామి, ఎల్.అప్పారావు పాల్గొన్నారు.

అహల్య ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం



మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ ఉమాశంకర్, డాక్టర్ రాజకుమారి తదితరులు

గుంటూరు మెడికల్: బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం ఆళ్లవారిపాలెంలో వీఎల్ఎస్ ప్రసాద్ తల్లి గోవర్ధన్, బీబీ రావు తల్లి విష్ణు మొలకల రామాయమ్మ జ్ఞాపకార్థం అహల్య ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. గుంటూరుకు చెందిన ఐవీఎఫ్ స్పెషలిస్ట్, అహల్య ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, డాక్టర్ శనక్కాయల రాజకుమారి ఆధ్వర్యంలో రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమా శంకర్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు వినియోగించుకోవాల్సిందిగా కోరారు. ఈ ఉచిత మెడికల్ క్యాంపులో సుమారుగా 200 మందికి మందులు పంపిణీ చేశామని తెలిపారు. డాక్టర్ రాజకుమారి మాట్లాడుతూ గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తల్లీబిడ్డ క్షేమంగా ఉండి సులువుగా ప్రసవం అయ్యే మార్గాల గురించి, ప్రెగ్నెన్సీలో చేయాల్సిన వ్యాయామం గురించి, తల్లి తీసుకోవాల్సిన వ్యాక్సినేషన్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ కోయ ప్రియాంక, డాక్టర్ గౌతమ్, డాక్టర్ ప్రియాంక, ఆళ్లవారిపాలెం సర్పంచి శ్రీనివాసరావు, అశోక్, వెంకటేష్, ప్రసాద్, బి.సీతారామయ్య, వి.బి.రావు పాల్గొన్నారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో డాక్టర్ తారకనాథ్, డాక్టర్ ఖాదర్ బాషాలకు సత్కారం



డాక్టర్ వి. రామతారకనాథ్



డాక్టర్ ఎస్. ఖాదర్ బాషా

గుంటూరు మెడికల్: జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా జూలై 1న ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) గుంటూరు శాఖ ఆధ్వర్యంలో వైద్యరంగంలో విశిష్ట సేవలు అందించిన ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ వి.రామ తారకనాథ్, జనరల్ ఫిజీషియన్, డాక్టర్ ఎస్. ఖాదర్ భాషాలను సత్కరిస్తున్నారు. ఈ విషయాన్ని ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ వై.సుబ్బారాయుడు ,డాక్టర్ బి. సాయికృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారితోపాటు గుంటూరు ఐఎంఏ శాఖ నుంచి ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షురాలు అయిన డాక్టర్ పమిడిముక్కల విజయ, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గార్లపాటి నందకిషోర్‌లను సన్మానిస్తున్నట్లు తెలిపారు.

చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారులు

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లిలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు చట్ట ప్రకారం ఇవ్వాల్సిన క్యాజువల్ లీవ్‌లు, వీక్లీ ఆఫ్‌లు ఇవ్వకుండా చట్టవిరుద్ధంగా అధికారులు పని చేయడం సరైన పద్ధతి కాదని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు అన్నారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని కృష్ణనగర్‌లో వాటర్ వర్క్స్ కార్మికులతో సమావేశంలో నిర్వహించారు. దుర్గారావు మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకుండా చట్టవిరుద్ధంగా వ్యవహరించడం సరైంది కాదని విమర్శించారు. కార్మికులకు 8 గంటల పని పద్ధతిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, మురళి రాజు, నరసింహారావు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణంలోని పారిశుద్ధ్య కార్మికులకు ఏడాదిగా కొబ్బరినూనె, సబ్బులు ఇవ్వకుండా అధికారులు తాత్సారం చేయడం తగదని వేముల దుర్గారావు అన్నారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేటలోని మచ్చలు పాయింట్ వద్ద మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులతో ఆయన సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. జూలై 9వ తేదీన దేశ వ్యాప్తంగా జరుగనున్న సార్వత్రిక సమ్మెలో పారిశుద్ధ్య కార్మికులు పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయులు బూరుగ వెంకటేశ్వర్లు, కార్మికులు రాంబాబు, నాగేశ్వరరావు, బాలయ్య, అనూష, శాంత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అక్రమాలపై విచారణ జరపాలి

తాడికొండ: రాష్ట్రంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకంలో భారీ అవినీతికి పాల్పడుతున్నారని.. దీనిపై కేంద్ర ప్రభుత్వం విచారణ చేయాలని గుంటూరు జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులు దాసరి రాజు అన్నారు. ఆదివారం తాడికొండ మండలం లాం గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్ఆర్ఈజీఎస్ చట్ట ప్రకారం ఉపాధి హామీ పనులు గ్రామ పంచాయతీల ద్వారానే జరిపించాలని.. కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించాల్సి ఉన్నప్పటికీ ఎక్కడా సక్రమంగా జరగడం లేదన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డి ఆదేశాల మేరకు సోమవారం గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 10 గంటలకు స్పందన కార్యక్రమంలో పలు సమస్యల పరిష్కారం కోరుతూ డిమాండ్‌లతో కూడిన వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తాడికొండ మండల పార్టీ అధ్యక్షుడు ముప్పాళ్ల మనోహర్, మైనేని నాగమల్లేశ్వరరావు, మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల పంచాయతీరాజ్ అధ్యక్షులు ఈపూరి రమేష్, పూసపాటి వెంకటరామిరెడ్డి, తాడికొండ, ఫిరంగిపురం, మేడికొండూరు పంచాయతీరాజ్ విభాగం మండల అధ్యక్షులు బొంతా శ్రీకాంత్ యాదవ్, గుత్తికొండ ప్రతాప్ రెడ్డి, షేక్ హాజీ, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు చుండు వెంకటరెడ్డి, తాడికొండ, లాం గ్రామ పార్టీ అధ్యక్షులు వంగా పోలారెడ్డి, షేక్ సలీమ్, మండల పార్టీ కార్యదర్శి రావూరి నరేష్, మైనార్టీ మండల అధ్యక్షులు షేక్ బాబావలి, పార్టీ నాయకులు షేక్ మీర్జావలి, షేక్ అయూబ్ తదితరులు పాల్గొన్నారు.